క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో మంగళవారం కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఒక ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ ప్రాగాటూల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఎన్‌సీఎల్ గోదావరి, దుర్గా విహార్, శాంతాశ్రీరామ్, ఆదిత్య విల్లాస్, కోణార్క్ ఆస్పత్రి, ప్రాగాటూల్స్ కాలనీ, జీఎల్ఆర్ ఎన్‌క్లేవ్, లక్ష్మి గంగా ఎన్‌క్లేవ్, అదే విధంగా 11 కేవీ పైపులైన్ రోడ్డు ఫీడర్ పరిధిలో బీహెచ్ఇఎల్ విస్టా కాలనీ, శ్వేత ఆర్యన్, ఆర్‌మ్స్‌బర్గ్, మారుతి సన్‌సిటీ, సుభాష్‌నగర్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



దుండిగల్: అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ సిబ్బందితో అక్రమ నిర్మాణాలను కూల్చి వేయించారు. మల్లంపేటలోని చిన్న చెరువు కట్ట కింది నుంచి పారే అలుగు కల్వర్టుపై నిర్మిస్తున్న అక్రమ షెడ్డును కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని కమిషనర్ సత్యనారాయణ హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై పారిశుద్ధ్య కార్మికురాలు ఫిర్యాదు

కుత్బుల్లాపూర్: శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఓ పారిశుద్ధ్య కార్మికురాలు కుత్బుల్లాపూర్ సర్కిల్ వైద్య ఆరోగ్య అధికారి రజినీకాంత్‌కు ఫిర్యాదు చేసింది. గాంధీనగర్ – నందనగర్ ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఓ మహిళను కొంతకాలంగా అక్కడ ఉండే ఎస్ఎఫ్ఏ ఇబ్బందులకు గురి చేయడమే కాక అసభ్యకరంగా మాట్లాడుతూ అందరి ముందు పరువు తీస్తున్నాడని, కొంతమందికి సహకరిస్తూ మరికొంత మందిని కక్ష సాధింపులు గురి చేస్తున్నాడని, అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని రజనీకాంత్ ఆమెకు హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్‌కేవీతో కార్మికుల సంక్షేమం



నష్ట పరిహారాన్ని అందజేస్తున్న ముద్దాపురం మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్‌కేవీ కట్టుబడి ఉందని శ్రమశక్తి అవార్డు గ్రహీత, బీఆర్ఎస్‌కేవీ నాయకుడు ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. బొంతపల్లి పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో నాగేష్ అనే వ్యక్తిని యాజమాన్యం తొలగించింది. దీంతో బాధితుడు మదన్‌గౌడ్‌ను ఆశ్రయించగా పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి రూ.80వేల నష్టపరిహారం ఇచ్చేలా ఒప్పించారు. సదరు మొత్తాన్ని సోమవారం షాపూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో కార్మికుడిని అందజేశారు.

పేట్‌బషీరాబాద్ పోలీసులకు అవగాహన



కుత్బుల్లాపూర్: అకస్మాత్తుగా గుండెనొప్పి వచ్చిన సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం ఎంహెచ్‌ఓ నిర్మల ఆధ్వర్యంలో పేట్‌బషీరాబాద్ పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గుండెనొప్పి వచ్చిన వ్యక్తికి అందించాల్సిన ప్రాథమిక చికిత్సను స్వయంగా చేసి చూపించారు. సీఐ ప్రశాంత్, సిబ్బంది ఉన్నారు.

ఇండస్ట్రియల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడి మృతి



అనంతుల కరుణాకర్‌రెడ్డి (ఫైల్)

రంగారెడ్డినగర్: యంకర్ పరిశ్రమల అధినేత, పంచశీల కాలనీ ఇండస్ట్రియల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అనంతుల కరుణాకర్‌రెడ్డి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీలలిత పరమేశ్వరి ఆలయాన్ని నిర్మించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న పలు పరిశ్రమల యాజమాన్యాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఫైర్ సేఫ్టీ పాటించాల్సిందే..

దూకుడు పెంచిన అధికారులు



అగ్ని ప్రమాదం జరిగిన దృశ్యం (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఫైర్ సేఫ్టీ విషయంలో అధికారులు దూకుడు పెంచారు. నగరం, నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అన్ని వ్యాపార కేంద్రాల్లో ఫైర్ సేఫ్టీ విషయంపై అవగాహన కల్పించి వారికి సేఫ్టీ సర్టిఫికెట్ అందజేసేలా కూకట్‌పల్లి జోనల్ పరిధిలో పలు వ్యాపారాలు నిర్వహించే వారికి నోటీసులు తయారు చేస్తూ వస్తున్నారు.. మూసాపేట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో చిన్న వ్యాపారం చేసుకునే 100 చదరపు మీటర్ల కంటే ఎక్కువ తక్కువ స్థలంలో ఉన్న భవనానికి వ్యాపారులు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ సంబంధించిన పరికరాలు అమర్చుకోవాలని సూచించగా ఎవరి నుంచీ స్పందన కనిపించలేదు. దీంతో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ లతో కుత్బుల్లాపూర్ సర్కిల్లో ఇప్పటివరకు 300కు పైగానే నోటీసులు జారీ చేసి ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చుకోవాలని సూచిస్తూ ముందుకు సాగుతున్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా...

అగ్ని ప్రమాదాలు జరిగే సందర్భంలో ప్రతిసారి భారీగా ఆస్తి నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో గ్రేటర్ అధికారులు సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టారు. చిన్న చిన్న వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులు తమ వస్తువులతో పాటు ప్రాణాలను అగ్ని ప్రమాదం జరిగే సమయంలో కాపాడుకునే దిశగా ఈ చర్యలు చేపట్టినట్లు జోనల్ కమిషనర్ మమత ‘సాక్షి’తో అన్నారు. ప్రతి వ్యాపారస్తుడు ముందుకు రావాలని కోరారు. దుకాణదారుడు ఎస్టాబ్లిష్మెంట్ 100 చదరపు మీటర్లకు పౌడర్ ఇకై ఫైర్ సామాగ్రిని ఇన్స్టాల్ చేయాలి. అదే విధంగా పెట్రోల్ బంకులు ఆయిల్ షాపులు మొదలైన ఆయిల్ స్టోరేజీలు 100 చదరపు మీటర్లకు ఫైర్ సేఫ్టీ యంత్రం ఏర్పాటు చేయాలని, దుకాణదారులు 100 చదరపు మీటర్లకు రెండు స్మోక్ డిటెక్టర్లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం



ర్యాలీగా వెళ్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి..

దుండిగల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే యువ సంఘర్షణ సభకు సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని, కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రియాంక గాంధీ రాష్ట్ర పర్యటన సందర్భంగా బిఆర్ఎస్ నేతల్లో వణుకు మొదలైందన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీటి సరఫరా బంద్

కుత్బుల్లాపూర్: గోదావరి జలాలు సరఫరా చేసే పంప్ హౌస్‌లో మోటార్లు రిపేరుకు రావడంతో నేటినుంచి (మంగళవారం) నుంచి 11వ తేదీ వరకు కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం కలుగనుందని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 12న తిరిగి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

చింతల్: మంగళ, బుధవారాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోనుందని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.గోదావరి నుండి ప్రధాన పైపులైన్‌కు సరఫరా అయ్యే పంపులకు మల్లారం వద్ద విద్యుత్ సరఫరా ఆటంకం తలెత్తడంతో సరఫరా నీటి నిలిచిపోయిందని పేర్కొన్నారు. మల్లారం నుండి వచ్చే ఇన్‌కమింగ్ పంపులకు తక్షణ మరమ్మతులు చేపట్టినా తిరిగి యధావిధిగా ట్రిప్పు కావడం వల్ల సరఫరా అత్యవసర పరిస్థితుల్లో నిలిపివేశారని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్ పరిధిలోని చింతల్, జగద్గిరిగుట్ట, షాపూర్ నగర్ లోని ప్రతి సెక్షన్లలో ఈ నీటి సరఫరా నిలిచిపోతుందని, సరఫరా పునరుద్ధరణ గురువారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నట్లు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కీసర గ్రామ పంచాయతీలో ప్రజాధనం దుర్వినియోగంపై నాలుగేళ్లుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ కీసర గ్రామ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. నాలుగేళ్ల వ్యవధిలో హరితహారం, ఫ్లెక్సీల బిల్లులు, ఎలక్ట్రికల్ గూడ్స్, ట్యూబ్ లైట్ల కొనుగోళ్లు, పల్లె ప్రగతి, పన్నుల వసూళ్ల తదితర వ్యవహారంలో సుమారుగా రూ.70 లక్షల ప్రజాధనం దుర్వినియోగమైందని, వివరాలతో కూడిన సమాచారాన్ని వినతి పత్రంతో ఆయన సమర్పించారు. ఏడాది కిందట కొన్ని అంశాలపై విచారణ జరిపి ఎంపీఓ, డీఎల్‌పీఓలు వేర్వేరుగా నివేదికలను జిల్లా పంచాయతీ శాఖ అధికారులకు అందజేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదుకు ముందు కలెక్టరేట్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకులు రవీందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లేష్, చంద్రమౌళి, అంజి, నాగరాజు, శ్రీనివాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం



వెల్లడిస్తున్న పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు, సీఐ ప్రశాంత్

కుత్బుల్లాపూర్: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తుల నుండి 30 కిలోల డ్రై గంజాయిని పేట్‌బషీరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రామలింగరాజు, సీఐ ప్రశాంత్‌లు వివరాలు వెల్లడించారు. ఈ నెల 7వ తేదిన బోయిన్‌పల్లి నుండి సుచిత్ర కు భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సుచిత్ర చౌరస్తాలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ ప్యాసింజర్ ఆటోను తనిఖీ చేయగా 15 బండిళ్లల్లో తరలిస్తున్న రూ.50 వేలు విలువ చేసే 30 కిలోల గంజాయి పట్టుబడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన ఉపేందర్ (28), భౌరంపేట్‌కు చెందిన తేజావత్ ఉపేందర్(38) లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుండి గంజాయితో పాటు ఆటో, మూడు మొబైల్ ఫోన్లు, రూ.6,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంజాయిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పేట్‌బషీరాబాద్ పోలీసులను ఏసీపీ అభినందించారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

నలుగురి అరెస్ట్

జీడిమెట్ల: అరకు నుండి గంజాయి తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్న నలుగురిని జీడిమెట్ల పోలీసులు రిమాండుకు తరలించారు. సీఐ పవన్ తెలిపిన మేరకు.. వెస్ట్ గోదావరి జిల్లా చాగల్లు మండలం నల్లవరం గ్రామానికి చెందిన సాయితేజ్(26) కేపీహెచ్‌బి కాలనీలో ఉంటూ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ముత్యాల ప్రవీణ్‌కుమార్(26), చిన్నిమిల్లి సాయిచరణ్(27), అల్లూరి సాయి చైతన్య(25), రాజు(27)లు కూకట్‌పల్లి ప్రాంతంలో ఉంటూ అందరూ కలిసి డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం మొదలుపెట్టారు. సోమవారం అరకు నుండి గంజాయి తీసుకువచ్చి షాపూర్‌నగర్‌లో విక్రయిస్తుండగా జీడిమెట్ల పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి 3కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

బ్రాహ్మణ సదనం ప్రారంభోత్సవం విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్: విప్రహిత బ్రాహ్మణ సదనం బ్రాహ్మణ జాతికే గర్వకారణమని శ్రీగాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ అన్నారు. ఈ నెల 31న శేరిలింగంపల్లి మండలం, గోపన్‌పల్లి గ్రామంలో బ్రాహ్మణ సదనాన్ని సీఎం ప్రారంభించనున్న నేపథ్యంలో సభను విజయవంతం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 6 ఎకరాల స్థలంలో 10 కోట్ల రూపాయల నిదులు వెచ్చించి బ్రాహ్మణ సదనాన్ని నిర్మించారన్నారు. ప్రారంభోత్సవానికి బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం సలహాదారుడు సర్వేపల్లి రమేష్ కుమార్, రాయపూడి ప్రభాకర్, గడ్డం రాంబాబు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



సత్యనారాయణ (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుండి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ పద్మానగర్ ఫేజ్–2లోని కృష్ణ చైతన్య టవర్స్‌లో ఉండే సత్యనారాయణ(58) గత నెల 26న తెల్లవారుజామున బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఉదయం నిద్ర లేచిన కుటుంబ సభ్యులకు సత్యనారాయణ కనిపించకపోవడంతో పలు ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జీడిమెట్ల ట్రాఫిక్ సీఐగా వెంకట్ రెడ్డి



సుభాష్‌నగర్: జీడిమెట్ల ట్రాఫిక్ సిఐగా వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేసిన చంద్రశేఖర్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో కమిషనర్ కార్యాలయంలో క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న వెంకటిరెడ్డి జీడిమెట్ల ట్రాఫిక్ వచ్చారు.

బాధితులకు ఫోన్లు అందజేసిన పోలీసులు

జీడిమెట్ల: బాధితులు పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌లను జీడిమెట్ల పోలీసులు వాటిని గుర్తించి అందజేశారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా పోలీసులు ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో డీసీపి టి.శ్రీనివాసరావు, ఏసీపి గంగారాం చేతుల మీదుగా 11 మందికి ఫోన్‌లను అందజేసినట్లు జీడిమెట్ల సీఐ పవన్ తెలిపారు.

అధికారుల నిర్వాకంతో ప్రజాధనం వృథా

సుభాష్‌నగర్: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనం వృథా అవుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధి సంస్కృతి ఎన్‌క్లేవ్, ద్వారకానగర్‌లో ఇటీవల వేసిన సీసీ రోడ్డును జీహెచ్ఎంసి అధికారులు భూగర్భ డ్రైనేజీ లైన్ వేసేందుకు తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పున్నారెడ్డి సోమవారం పనులు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని అధికారుల తీరును ఎండగట్టారు. స్థానికంగా డ్రైనేజీ సమస్య నెలకొందని అధికారులకు తెలిసినా హడావడిగా రోడ్డు పనులు పూర్తిచేశారని, ఇప్పుడు రోడ్డును తవ్వి మరలా డ్రైనేజీ లైన్ వేయడం ఎంత వరకు సమంజమన్నారు.



నూతనంగా వేసిన రోడ్డును తవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పున్నారెడ్డి

సర్వతోముఖాభివృద్ధి దిశగా తెలంగాణ

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు బస్తీ, కాలనీల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు.

- సూరారం శివాలయనగర్‌కు చెందిన సుభాష్, రాజీవ్‌గృహకల్పకు చెందిన దేవేందర్‌సింగ్‌లు శ్రమశక్తి అవార్డులు అందుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.
- భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు కొండల శ్రీనాథ్‌రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరుగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.



జగన్‌కు ఆటోను అందజేసిన ఎమ్మెల్యే వివేకానంద్

- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సొంత ఊరికి వెళ్లేందుకు సిద్ధమైన వ్యక్తికి ఎమ్మెల్యే అండగా నిలిచారు. సుభాష్‌నగర్‌కు చెందిన ఉద్యమకారుడు జగన్ జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అతనికి తన సొంత నిధులతో ఆటోను కొనుగోలు చేసి సోమవారం తన కార్యాలయంలో అందజేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



అధికారులతో సమావేశమైన నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి..

నిజాంపేట్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంచార్జి కమిషనర్ రామకృష్ణరావు అధ్యక్షతన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా, రోడ్ల విస్తరణ, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలను సకాలంలో పూర్తి చేయాలని, పనులు చేపడుతున్న క్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి, ఆగం రాజుముదిరాజ్, ఇంజనీరింగ్, ఎస్ఎన్‌డీపీ, శానిటేషన్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీఎస్‌పీకి మాదిగలు గుణపాఠం చెబుతారు



మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక న్యాయాన్ని విస్మరించి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతివ్వని బీఎస్‌పీకి తెలంగాణ మాదిగలు తగిన గుణపాఠం చెబుతారని ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకులు పేర్కొన్నారు. సోమవా రం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమ శేఖర్‌మాదిగ, కార్యదర్శులు పల్లెర్ల సుధాకర్, మురళీకృష్ణ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు ప్రకటిస్తే బీఎస్పీతో కలిసి నడుస్తామని ఎమ్మార్పీఎస్ అధినేత మాయావతికి లేఖ రాసినా హైదరాబాద్‌లో జరిగిన సభలో వర్గీకరణ అంశాన్ని ప్రస్తవించకపోవడం దారుణమన్నారు. దళితుల్లో మాదిగలు, ఉపకులాల ఓట్లు అడిగే నైతిక హక్కు బీఎస్‌పీకి లేదన్నారు. సమావేశంలో అజయ్ స్వామాట్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల అభివృద్ధికి సీఎం కృషి



ఓయూలో మాట్లాడుతున్న పద్మారావుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఓయూ ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఈద్- మిలాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, యూజీసీ డీన్ మల్లేష్, టీఎన్‌జీవో అధ్యక్షులు రాజేందర్, ఎన్‌జీవోస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ముస్లిం ఉద్యోగులు లేకున్నా ఈద్ మిలాపా?

ఓయూలో ముస్లిం ఉద్యోగులు లేకున్నా ఈద్–మిలాప్ జరపడం తగదని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. గతంలో ముస్లిం ఉద్యోగులు సుమారు 400 వరకు ఉండేవారని వారి కోసం ప్రతి ఏటా ఆనవాయితీగా ఈద్ మిలాప్ జరిపేవారని ఉద్యోగ విరమణలు నియామకాలు జరపనందున ప్రస్తుతం ముస్లిం ఉద్యోగులు 30 మంది కూడా లేరన్నారు. పండుగ పేరుతో రాజకీయం చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టి ముస్లిం రిజర్వేషన్లను పాటించాలని డిమాండ్ చేశారు.